సాక్షి
అనంతపురం
గురువారం । 23 । జనవరి । 2025



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



టమాట కిలో రూ.14

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.14 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.1°/10.6°

జిల్లా అంతటా బుధవారం చలి వాతావరణం పెరిగింది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

జీజీహెచ్‌లో వెల్‌నెస్ సెంటర్



వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు

అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డీఈఐసీలో ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్‌ను బుధవారం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనే ధ్యేయంగా ముందుకెళ్తామన్నారు. మధుమేహం, రక్తపోటు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలు, తదితర సూచనలు సలహాలను వెల్‌నెస్ సెంటర్‌లో అందిస్తారన్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ జిల్లా ప్రజలు వెల్‌నెస్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, సామాజిక వైద్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మధు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆదినటేష్ తదితరులు పాల్గొన్నారు.

12 శాతం లోపు తేమ ఉంటేనే కందుల కొనుగోలు

- మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి

అనంతపురం అగ్రికల్చర్: 12 శాతం లోపు తేమ ఉన్న నాణ్యమైన కందులనే కొనుగోలు చేస్తామని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్‌లో రైతులు పండించిన కందులను కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) క్వింటా రూ.7,550 ప్రకారం కొనుగోలు చేసే ప్రక్రియ ఒకట్రెండు రోజుల్లో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఇప్పటికే ఆర్‌ఎస్‌కేల్లో 2 వేల మంది వరకు రైతులు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. మిగతా రైతులు కూడా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచించారు. ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి అన్నారు. మరిన్ని వివరాలకు కంట్రోల్ రూం -8500292992 లేదా 8978381841 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా 31 కేంద్రాల్లో కొనుగోలు చేస్తామని, కందులు పండించిన రైతులు బహిరంగ మార్కెట్‌లో ఎంఎస్‌పీ కన్నా తక్కువ ధరకు అమ్ముకోవద్దని సూచించారు.

రైతు ఆత్మహత్యల వివరాలు పంపండి

- అధికారులకు జేడీఏ ఉమామహేశ్వరమ్మ ఆదేశం

అనంతపురం సెంట్రల్: జిల్లాలో రైతు ఆత్మహత్యల వివరాలను ఎప్పటికప్పుడు గ్రామ, మండల, డివిజన్‌స్థాయి కమిటీలు పరిశీలించి వివరాలను అందజేయాలని సంబంధిత అధికారులను జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏడీలు, ఏఓలతో ఆమె సమావేశమై మాట్లాడారు. 2024-25 రబీ సీజన్‌లో ఈ-పంట నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకూ 2,09,462 ఎకరాలకు గాను 1,69,663 ఎకరాల్లో పంట నమోదు కార్యక్రమం పూర్తయిందన్నారు. అలాగే 90,774 ఎకరాలకు ఈ-కేవైసీ చేశారన్నారు. ప్రస్తుతం పప్పుశనగ కోత దశలో ఉన్నందున ఈ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కిసాన్ డ్రోన్‌లకు సంబంధించి కొత్త గ్రూపులను ఏర్పాటు చేయాలని, ఆసక్తి ఉన్న వారికి పైలట్ శిక్షణ ఇవ్వాలని సూచించారు. రైతుల భూములకు రిజిస్ట్రేషన్ కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో గ్రామాల మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు.

- రాయదుర్గం ప్రాజెక్టు పరిధిలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో 3 సంవత్సరాల 4 నెలల చిన్నారికి ఇటీవల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 9.2 కేజీల బరువు, 85 సె.మీ ఎత్తు ఉన్నట్లు గుర్తించారు. వాస్తవంగా ఆ వయసు చిన్నారి 90–102 సెం.మీ ఎత్తు, 13–16 కేజీల బరువు ఉంటేనే ఆరోగ్యంగా ఉన్నట్లు లెక్క.

- రాయదుర్గం పట్టణానికి చెందిన మంజునాథ భార్య సరళజ్యోతి గర్భం దాల్చింది. రక్తహీనతతో బాధపడుతున్న ఆమె అంగన్‌వాడీ ద్వారా ఇచ్చే సరుకులను క్రమం తప్పకుండా తీసుకునేది. అయినా, సమస్య దూరం కాలేదు. పురిటినొప్పులతో ఇటీవల అనంతపురం ఆస్పత్రిలో చేరగా.. ప్రసవానంతరం తల్లీబిడ్డ ఇద్దరూ మృతి చెందారు. ఈమె ఒక్కరే కాదు రాయదుర్గానికి చెందిన మరో ఇద్దరు గర్భిణులు కూడా రక్తహీనతతో బాధపడుతూ ప్రసవానంతరం మరణించడం విషాదం నింపింది.

పౌష్టికా ఘోరం!



- అంగన్‌వాడీ సరుకుల్లో నాణ్యత డొల్ల
- కొన్ని కేంద్రాలకు అరకొరగా సరఫరా
- రక్తహీనతతో గర్భిణుల సతమతం
- పుట్టిన పిల్లల్లోనూ అనారోగ్య సమస్యలు

రాయదుర్గం: అంగన్‌వాడీ ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సరుకుల్లో నాణ్యత తీసికట్టుగా మారుతోంది. కొన్ని కేంద్రాలకు అరకొరగా సరుకులు సరఫరా చేస్తున్నారు. చాలా తక్కువ సైజుతో ఉండే కోడిగుడ్లు అందిస్తుండటంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు.కూటమి ప్రభుత్వ అలసత్వం కారణంగా గర్భిణులు రక్తహీనతతో కొట్టుమిట్టాడుతున్నారు. కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు.

హాట్‌టాపిక్‌గా సీడీపీఓల అంశం..!

జిల్లాలోని కణేకల్లు, ఉరవకొండ, శింగనమల, అనంతపురం రూరల్, గుత్తి ప్రాజెక్టుల్లో విధులు నిర్వహిస్తున్న సీడీపీఓలు విజయవాడ రావాలంటూ రెండు రోజుల క్రితం ఐసీడీఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి పిలుపు రావడం జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరుకులు అందిస్తున్నా.. ఆయా ప్రాజెక్టుల పరిధిలో చాలామంది పిల్లలు ఎత్తుకు తగ్గ బరువు, బరువుకు తగ్గ ఎత్తు లేకపోవడంతో పాటు పలు సమస్యలతో బాధపడుతున్నట్లు తేలిందని, అందుకే ఈ విషయంపై వివరణ ఇచ్చేందుకు ఆయా సీడీపీఓలను పిలిచినట్లు తెలిసింది. అయితే, సరుకులే బాగా లేనప్పుడు ఎవరు మాత్రం ఏం చేస్తారనే విమర్శలు వినిపిస్తుండటం గమనార్హం.

గతంలో ప్రత్యేక దృష్టి..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాతాశిశు సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. అంగన్‌వాడీల్లో సంస్కరణలు అమల్లోకి తీసుకొచ్చారు. నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందజేస్తూ తల్లీబిడ్డల సంక్షేమానికి పాటుపడ్డారు. 'బాలామృతం', 'బాల సంజీవని' కిట్ల ద్వారా నాణ్యమైన కోడిగుడ్లు, పాలు, కందిపప్పు, ఆయిల్, చిక్కీ, రాగిపిండి, ఎండు కర్జురం బియ్యం అందించి ఆదుకున్నారు.

తీవ్ర నిర్లక్ష్యం..

కూటమి ప్రభుత్వంలో మాతాశిశువులపై అంతులేని నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖలు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడం లేదు. దీంతో కిట్లను తల్లిదండ్రులు సరిగా తీసుకోవడం లేదు. ఈ క్రమంలోనే సమస్యలు తలెత్తుతున్నాయి. రక్తహీనత నివారించాలంటే చిన్నారులకు చిరుధాన్యాలతో చేసిన ఆహారం ఇవ్వడంతో పాటు బెల్లం, వేరుశనగ, నువ్వులతో తయారు చేసిన ఉండ్లు అందించాలి. పాల ఉత్పత్తులు, గుడ్లు, మాంసం, ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకునేలా గర్భిణులను ప్రోత్సహించాలి.



రేకులకుంట అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి ఎత్తు కొలుస్తున్న సిబ్బంది

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు	2,302
బాలింతలు	16,681
గర్భిణులు	17,594
ఆరేళ్లలోపు చిన్నారులు	1,47,077
తక్కువ బరువున్న పిల్లలు	4,133
అతి తక్కువ బరువున్న పిల్లలు	607
తీవ్ర పోషణ లోపం	2337
అతి తీవ్ర పోషణ లోపం	747

సమతుల ఆహారం తీసుకోవాలి

సమతుల ఆహారం తీసుకుంటేనే రక్తహీనత నివారణ సాధ్యమవుతుంది. ముఖ్యంగా బిడ్డకు ఆరు నెలల వరకూ తల్లిపాలే పట్టించాలి. ఏడాది తర్వాత పోషకాలు, విటమిన్లు ఉండే ఆహారం అందించాలి. ఉదయం సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి. దీంతో డీ విటమిన్ లభిస్తుంది. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం పట్ల నిర్లక్ష్యం చూపరాదు.

– మెర్సీ జ్ఞానసుధ, సూపరింటెండెంట్, రాయదుర్గం ఏరియా ఆస్పత్రి



డీ హీరేహాళ్‌లో చిన్నారుల బరువును చూస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

నాణ్యమైన పోషకాహారం అందిస్తున్నాం

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నాం. రక్తహీనత నివారణకు అవగాహన చర్యలు చేపట్టాం. పాలు, గుడ్లు, బాలసంజీవని, బాలామృతం కిట్లు అందిస్తున్నాం. అతి తక్కువగా రక్తం, ఎదుగుదల లోపం, ఎత్తుకు తగ్గ బరువు లేని వారిని గుర్తించి జాగ్రత్తలు సూచిస్తున్నాం.

– వనజఅక్కమ్మ, ఐసీడీఎస్ పీడీ

రీ-సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లాలో రీ-సర్వే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విమర్శలు, వివాదాలకు తావివ్వకుండా నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు రీ-సర్వే పక్కాగా నిర్వహించాలని చెప్పారు. రీ-సర్వే డిప్యూటీ తహసీల్దార్లు బాధ్యతగా పని చేయాలన్నారు. ప్రతి శుక్రవారం చుక్కల భూములు, 22-ఏ భూములకు సంబంధించి జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. డీ.హీరేహాళ్ మండలంలో చుక్కల భూముల ఫైళ్ల పెండింగ్‌ను 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. పరిష్కార వేదిక ఆర్ఓఆర్‌కు సంబంధించి గుత్తిలో 168 పెండింగ్‌లో ఉన్నాయని, వీటిలో ఎక్కువ భాగం మిగులు భూమి కావడంతో నోటీసులు ఇచ్చినట్లు వెల్లడించారు. త్వరలో ఇవి పరిష్కారమవుతాయన్నారు. జిల్లాలో ఫ్రీ హోల్డ్ భూములు, ఫిర్యాదులను ప్రతి రోజూ సమీక్షిస్తామన్నారు. సమావేశంలో డీఆర్ఓ మలోల, సర్వే శాఖ ఏడీ రూప్లానాయక్, తదితరులు పాల్గొన్నారు.

కాలితో తన్ని.. కులం పేరుతో దూషించి..

–దళితుడిపై 'పచ్చ' కార్యకర్త దాడి

పెద్దవడుగూరు: దళితుడిపై టీడీపీ కార్యకర్త దాడి చేసిన ఘటన మండల పరిధిలోని కోనాపురంలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామంలో మంగళవారం దేవర ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి పొలి చల్లిన వస్తువులకు బుధవారం రాత్రి నిర్వహించిన వేలంపాటలో దళితుడు గంగన్న పాల్గొన్నారు. ఈ క్రమంలోనే అతడిపై టీడీపీ కార్యకర్త ప్రసాద్ రెచ్చిపోయాడు. 'వేలంపాటలో పాల్గొనేందుకు నీకెంత ధైర్యం రా' అంటూ కాలితో తన్నాడు. కులం పేరుతో దూషించాడు. అక్కడ ఉన్న వారు ప్రసాద్‌కు నచ్చజెప్పి గంగన్నను అతని ఇంటికి పంపించారు. ఇంతలోనే ఇంటికి వచ్చిన గంగన్న కుమారుడు రామాంజనేయులు తండ్రికి జరిగిన అవమానం గురించి తెలుసుకుని ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. ఈ క్రమంలోనే ప్రసాద్‌తో పాటు మరి కొంతమంది గంగన్న ఇంటిపై దాడికి దిగారు. వస్తువులను బయటకు విసిరేశారు. పోలీసులు గ్రామానికి చేరుకొని దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజినేయులు తెలిపారు.

వందనాలమ్మా..!

- నెలాఖరు నుంచి హెచ్చెల్సీకి నీటి నిలుపుదల
- ఈ ఏడాది జిల్లాకు గణనీయంగా నీరు
- అదనపు కోటాతో కలిసి 32.345 టీఎంసీల కేటాయింపు

అనంతపురం సెంట్రల్: జిల్లా వరప్రదాయిని తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి నీటి విడుదల నిలిచిపోనుంది. ఈ నెలాఖరుతో కోటా పూర్తి కానుండడంతో నీటిని బంద్ చేస్తున్నట్లు టీబీ బోర్డు అధికారులు ప్రకటించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది గణనీయంగా 32.345 టీఎంసీల నీటిని జిల్లాకు కేటాయించారు. ఇప్పటి వరకూ 30.987 టీఎంసీలు చేరాయి. ఖరీఫ్ ప్రారంభంలో కాస్త ఆందోళన కలిగించినా తర్వాత కురిసిన భారీ వర్షాలు,తుపాన్ల కారణంగా తుంగభద్ర జలాశయానికి భారీ స్థాయిలో వరద వచ్చింది. జలాశయంలో 182.783 టీఎంసీలు నీటి లభ్యత కాగా దామాషా ప్రకారం 30.354 టీఎంసీలు కేటాయించారు. కేసీ కెనాల్ వాటా మరో 2 టీఎంసీలు అదనంగా రావడంతో ఈ ఏడాది మొత్తం 32.354 టీఎంసీలకు చేరింది.

ఆదుకున్న తుంగభద్ర..

తుంగభద్ర నీరు ఈ ఏడాది జిల్లా రైతాంగం, ప్రజానీకాన్ని ఆదుకుందనే చెప్పవచ్చు. ఆశించిన దానికి మించి నీరు రావడంతో ఆయకట్టుకు పుష్కలంగా అందించడమే కాకుండా చెరువులను నింపారు. తాగునీటి అవసరాలకు 10 టీఎంసీలు కేటాయించినా దాదాపు లక్ష ఎకరాలకు సాగు నీరందిస్తుండటం గమనార్హం. ప్రస్తుతం పీఏబీఆర్‌లో 3.637 టీఎంసీలు, ఎంపీఆర్‌లో 1.510 టీఎంసీలు, చిత్రావతిలో 8.4764, చాగల్లు 0.816, పెండేకల్లు 0.277 టీఎంసీల నీరు ఉన్నాయి. త్వరలో హెచ్చెల్సీ కోటా పూర్తి కానున్న నేపథ్యంలో 'సాక్షి'తో ఎస్ఈ ఎన్. రాజశేఖర్ మాట్లాడారు. తుంగభద్ర జలాశయం నుంచి ఈ ఏడాది ఆశించిన స్థాయిలో నీరు వచ్చిందన్నారు. ఈ నెలాఖరుతో మొత్తం కోటా పూర్తవుతుందన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు సరిపడా నీరు రిజర్వాయర్లలో నిల్వ ఉందని చెప్పారు. ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా రైతులకు అందిస్తామని చెప్పారు.



తుంగభద్ర జలాశయం

నిలిచిపోయిన ఇన్‌ఫ్లో

బొమ్మనహాళ్: కర్ణాటకలోని హొస్పేట వద్ద ఉన్న తుంగభద్ర జలాశయంలో నీటి మట్టం తగ్గింది. ఈ నెల 5 నుంచి డ్యాంలోకి ఇన్‌ఫ్లో నిలిచిపోయింది. 11,243 క్యూసెక్కుల నీటిని కాలువలకు వదులుతున్నారు. 18 రోజుల వ్యవధిలో 16 టీఎంసీలను కాలువలకు విడుదల చేశారు. 1,633 అడుగులతో 105.788 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయంలో బుధవారం సాయంత్రానికి 1,620.28 అడుగుల వద్ద 62.117 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు వెల్లడించారు.

'పీడీ' వ్యవహారంపై దుమారం

- విద్యాశాఖలో జోరుగా చర్చ
- ఉన్నతాధికారుల ఆగ్రహం

SAKSHI EFFECT సాక్షికి స్పందన

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రజాప్రతినిధుల పేరు చెప్పుకుంటూ విద్యాశాఖ, సమగ్రశిక్ష కార్యాలయాలను శాసిస్తున్న సాధారణ ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) వ్యవహారంపై విద్యాశాఖ, సమగ్రశిక్షలో దుమారం రేగింది. ఈయన మితిమీరిన జోక్యంపై బుధవారం 'సాక్షి'లో 'పట్టి 'పీడీ'స్తున్నారు..' శీర్షికతో ప్రచురితమైన కథనం కలకలం రేపింది. విద్యాశాఖ వర్గాల్లో జోరుగా చర్చ సాగింది. ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్ర విద్యాశాఖ ఉద్యోగులు, అధికారుల వరకు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ చేశారు. బయట జిల్లాల నుంచి సమగ్రశిక్ష, ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఇక్కడి ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులకు ఫోన్లు చేసి మరీ పీడీ గురించి ఆరాతీశారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్, సమగ్ర శిక్ష ఎస్పీడీ దృష్టికీ వెళ్లింది. కలెక్టర్ వినోద్‌కుమార్ సీరియస్‌గా తీసుకున్నారు. పాఠశాల విద్య ఆర్జేడీ (కడప) శామ్యూల్ స్పందించి, జిల్లా విద్యాశాఖ అధికారికి ఫోన్ చేసి మాట్లాడారు. పీడీ వ్యవహారంపై రిపోర్ట్ ఇవ్వాలంటూ డీఈఓను ఆదేశించారు. ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పుకుంటూ ఒక సాధారణ పీడీ ఈ స్థాయిలో బెదిరింపులకు పాల్పడుతుండటాన్ని అధికారులు సీరియస్‌గా పరిగణించారు. కొందరు ఉద్యోగ సంఘాల నాయకులు సదరు ప్రజాప్రతినిధుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్లినట్లు తెలిసింది. ప్రజాప్రతినిధులకు చెడ్డపేరు తెచ్చేలా పీడీ వ్యవహారాలు ఉంటున్నాయని నేరుగా పీఏలకు ఫోన్లు చేసి చెప్పారు. పీడీ వ్యవహారంపై విచారణకు ఇద్దరు అధికారులను నియమించనున్నట్లు తెలిసింది.

ఆ సంఘం నేతదీ అదే తీరు!

అధికార పార్టీకి అనుబంధంగా ఉన్న ఉపాధ్యాయ సంఘంలోని ఓ నాయకుడి తీరుకూడా ఇదే రకంగా ఉంటోందని డీఈఓ, సమగ్రశిక్ష కార్యాలయాల ఉద్యోగులు వాపోతున్నారు. గడిచిన ఐదేళ్లలో ఏ ఒక్క రోజూ ఉపాధ్యాయుల సమస్యలపై కనీసం మాట్లాడని ఆ నాయకుడు.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సామాజిక వర్గాన్ని అడ్డుపెట్టుకుని ఉద్యోగులపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు చేస్తున్నాడు. కొందరి ఎమ్మెల్యేల పేర్లు చెప్పుకుంటూ పైరవీలు చేస్తున్నాడని ఉద్యోగులు వాపోతున్నారు. ఆయన సామాజిక వర్గానికి చెందిన చాలామంది టీచర్లు ప్రజాప్రతినిధులకు చాలా దగ్గరగా ఉంటున్నా... విద్యాశాఖలోకానీ, ఇటు సమగ్రశిక్షలో కానీ పెత్తనం చేయడం లేదంటున్నారు. ఇలాంటి వారిని ప్రజాప్రతినిధులు అదుపు చేయాలని, లేదంటే ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తారని చెబుతున్నారు.

ఘనంగా 'డాకు మహారాజ్' విజయోత్సవం





వేదికపై సినీ హీరో బాలకృష్ణ, హీరోయిన్లు ఊర్వశి రౌతేలా, శ్రద్ధా శ్రీనాథ్, దర్శకుడు బాబీ, కార్యక్రమంలో పాల్గొన్న అభిమానులు, నగరవాసులు

అనంతపురం: నగరంలో బుధవారం 'డాకు మహారాజ్' చిత్ర విజయోత్సవం ఘనంగా జరిగింది. నటీనటులను చూసి అభిమానులు, నగరవాసులు ఆనందం వ్యక్తం చేశారు. డాకు మహారాజ్ చిత్రం ఈ నెల 12న విడుదలైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా అనంతపురంలో చిత్ర విజయోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సినీ నటుడు నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ తాను దైవాన్ని నమ్ముతానన్నారు. తల్లిదండ్రులు, కళామతల్లి ఆశీర్వాదంతో వరుసగా నాలుగో విజయం సాధించానన్నారు. ప్రతి సినిమాను ఛాలెంజ్‌గా తీసుకుని నటిస్తానన్నారు. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సందడి చేసిన సినీ తారలు..

డాకు మహారాజ్ చిత్రంలో నటించిన నటీనటుల రాకతో నగరంలో సందడి నెలకొంది. చిత్ర దర్శకుడు బాబీ, నటుడు బాబీ డయోల్, హీరోయిన్లు ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్, చాందిని చౌదరి, ఊర్వశి రౌతేలాను చూసి అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు.

పేగుబంధం పెనవేసుకుని.. గుండెల్ని హత్తుకుని!



నేనున్నానమ్మా..: నాగమునెమ్మను స్కూటీపై కూర్చోబెడుతున్న ప్రమీల



మా చిట్టి తల్లే: తాడుతో తల్లిని నడుముకు కట్టుకుంటూ..

సృష్టిలో అమ్మకన్నా విలువైనది ఏదీ లేదు. కడుపులో బిడ్డ పడిందని తెలియగానే ఆమె ఆనందం అంతా ఇంతా కాదు. నవమాసాలు కంటికి రెప్పలా కాపాడుకుంటుంది. ప్రాణాలు పోయేంతటి బాధనూ తట్టుకుని బిడ్డకు ప్రాణం పోస్తుంది. అలా పేగుబంధాన్ని పంచిన తల్లికి కష్టం కలగకుండా ఆమె కుమార్తె తీసుకెళ్లిన తీరు పలువురిని కదిలించింది. రాప్తాడుకు చెందిన నాగమునెమ్మకు ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు సంతానం. నాగమునెమ్మ ఇటీవల పక్షవాతం బారిన పడింది. ఈ క్రమంలో తల్లికి వైద్య పరీక్షలు చేయించేందుకు ఆమె కుమార్తె ప్రమీల బుధవారం అనంతపురం సర్వజన ఆసుపత్రికి తీసుకొచ్చారు. తిరుగు ప్రయాణంలో స్కూటీపై ఇదిగో ఇలా తల్లి ఎలాంటి ఇబ్బంది పడకుండా నడుముకు తాడుతో కట్టుకుని తీసుకెళ్లి గుండెల్ని హత్తుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

క్లుప్తంగా

మహారాష్ట్ర వాసి హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ వెంకటరమణ

డి.హీరేహాళ్(రాయదుర్గం): బతుకు తెరువు కోసం మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... మహారాష్ట్రలోని మిరాజ్ జిల్లాలోని సంచారజాతులకు చెందిన పల్లి శంకర్‌బూస్లీ (40) తన కుటుంబసభ్యులతో కలసి బతుకు తెరువు కోసం వలసవచి డి.హీరేహాళ్ మండలం ఓబుళాపురం సమీపంలోని ఇందిరమ్మ కాలనీలోని అద్దె ఇంట్లో ఉంటున్నారు. చుట్టుపక్కల గ్రామాల్లో సంచరిస్తూ ప్లాస్టిక్ గృహోపకరణాలు విక్రయించి రాత్రికి ఇంటికి చేరుకునేవారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఓబుళాపురం గ్రామ శివారులో శంకర్ బూస్లీ హత్యకు గురయ్యాడు. సమాచారం అందుకున్న సీఐ వెంకటరమణ, ఎస్ఐ గురుప్రసాదరెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు మారణాయుధాలతో దాడి చేసినట్లుగా ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారణ అయింది. కాగా, కుటుంబ కలహాల నేపథ్యంలో అల్లుడు శీనసాయక్ హత్య చేసి ఉంటాడనే అనుమానాలను హతుడి భార్యతో పాటు బంధువులూ అనుమానాలు వ్యక్తం చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అట్టహాసంగా ప్రారంభమైన అల్ట్రా మారథాన్



మారథాన్‌ను ప్రారంభిస్తున్న మాంఛో ఫెర్రర్

బొమ్మనహాళ్/అనంతపురం: మండలంలోని వెంకటాద్రిపల్లి నుంచి 10వ అనంతపురం అల్ట్రా మారథాన్ రన్‌ను ప్రముఖులతో కలసి ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ బుధవారం ప్రారంభించారు. స్పెయిన్ స్పాన్సర్లను ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాంఛో ఫెర్రర్ మాట్లాడారు. వెంకటాద్రిపల్లి నుంచి సంస్థ కార్యకలాపాలను అప్పట్లో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ప్రారంభించారని గుర్తు చేశారు. ఆ స్ఫూర్తితోనే ఇక్కడి నుంచే 10వ అల్ట్రా మారథాన్ రన్‌ను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. 600 గ్రామాలను కలుపుతూ సుమారు 170 కిలోమీటర్ల మేర మారథాన్ కొనసాగి గురువారం మధ్యాహ్నం బత్తలపల్లిలోని ఫాదర్ ఫెర్రర్ ఘాట్ వద్ద ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో విశాలఫెర్రర్, అల్ట్రా మారథాన్ రన్నర్ జువాన్ మానువేల్, సీఐ చిన్నగౌస్, వజ్రకరూరు ఎస్ఐ నాగస్వామి, ఆర్డీటీ ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



పురాతన వస్తువులను పరిశీలిస్తున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, ఏడీఆర్ఎం సుధాకర్ తదితరులు



ఆసక్తిగా గమనిస్తున్న విద్యార్థులు



గ్రామ్‌ఫోన్‌లు, రికార్డులు, మైక్‌లు

అబ్బురపరుస్తున్న ప్రదర్శన

గుంతకల్లు: స్థానిక రైల్వే కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన పురాతన వస్తు ప్రదర్శన సందర్శకులను అబ్బురపరుస్తోంది. రాయలసీమ ది నుమిస్మాటిక్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను బుధవారం డీఆర్ఎం సి.చంద్రశేఖర్ గుప్తా, ఏడీఆర్ఎం సుధాకర్ ప్రారంభించారు. ద్వాపర యుగం నాటి నాణేలు మొదలు ఇప్పటి వరకూ వినియోగంలో ఉన్న 250 దేశాల కరెన్సీ, స్టాంప్‌లు, రాయలు, కుషాణులు, శాతవాహనులు, చోళులు, దేవగిరి తదితర రాజుల కాలంలో వినియోగించిన గృహోపకరణాలు, పురాతన కెమెరాలు, టెలిస్కోప్‌లు, స్లైడ్ ప్రొజెక్టర్లు, రేడియోలు, సౌండ్ సిస్టం తదితరాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. బొగ్గు రైలింజన్ నుంచి ప్రస్తుత విద్యుత్ రైలింజన్ల నమూనాలు, మారిన రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థనూ ప్రదర్శనలో ఉంచారు. ప్రతి వస్తువునూ వందలాది మంది విద్యార్థులు ఆసక్తిగా గమనించి, వాటి ఉపయోగం, పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు గోవిందరాజులుగుప్తా, ఐఎం ఫెర్నాండేజ్, డీసీ శేఖర్, రాధాస్వామి, దుర్గాచరణ్, నాగేంద్రబాబు, ప్రవీణ్ సాయి, అరవింద్ ఆచార్య, శివప్రసాద్, సాయిదీప్, ప్రభాకర్, అనిల్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



దశాబ్దాల క్రితం నాటి రేడియోలు, ట్రాన్సిస్టర్లు, టేప్ రికార్డులు, ప్రొజెక్టర్లు



పాత కాలం నాటి వివిధ రకాల టెలిస్కోప్‌లు

అర్హత లేకున్నా సిఫారసు

- అనర్హుడికి డీఈఓ కార్యాలయ ఏఎస్ఓ పోస్టు కట్టబెట్టే యత్నం
- ఇప్పటికే ఫైలు సిద్ధం చేసిన విద్యాశాఖ అధికారులు
- గతంలో ఏఎస్ఓగా పనిచేసిన సమయంలో పెద్ద ఎత్తున ఆరోపణలు
- తిరిగి ఆయనే కావాలంటూ టీడీపీ నేతల ఒత్తిళ్లు
- నోటిఫికేషన్ జారీ చేసి అర్హులకు అవకాశం ఇవ్వాలంటున్న టీచర్లు

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లా విద్యాశాఖ వివాదస్పద నిర్ణయాలకు కేరాఫ్‌గా మారుతోంది. గతంలో ఇక్కడ డీఈఓగా పని చేసిన ఓ అధికారి నిబంధనలకు విరుద్ధంగా తీసుకున్న ఏకపక్ష నిర్ణయంతో నేటికీ సమగ్రశిక్ష కార్యాలయానికి సెక్టోరియల్ అధికారులు లేకుండా పోయారు. ఫలితంగా విద్యాభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ కరువైంది. తాజాగా డీఈఓ కార్యాలయంలోనూ ఇలాంటి నిర్ణయమే తీసుకుంటున్నారు. టీడీపీ నేతల ఒత్తిళ్ల కారణంగా అనర్హుడిని అందలం ఎక్కించేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. విద్యాశాఖలో అత్యంత కీలకమైన ఏఎస్ఓ పోస్టుకు అర్హత ఉన్న టీచరును తప్పించి అనర్హుడిని తీసుకొస్తుండంతో సామాన్య ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఏఎస్ఓ పోస్టుకు అర్హత ఇదీ

నిబంధనల మేరకు గతంలో ఏఎస్ఓ పోస్టుకు స్కూల్ అసిస్టెంట్ గణితం టీచర్లు మాత్రమే అర్హులు. తాజాగా గణితంతో పాటు ఫిజికల్ సైన్స్ టీచర్లనూ అర్హులుగా పేర్కొంటూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఇక్కడ ఈ రెండు సబ్జెక్టులు కాకుండా ఇంగ్లిష్ టీచరును ఆ పోస్టులో కూర్చోబెట్టేందుకు రంగం సిద్ధం చేయడం వివాదాస్పదమైంది. ఇప్పటికే ఈ పోస్టు కోసం తీవ్రప్రయత్నం చేస్తున్న ఇంగ్లిష్ టీచరు ఓ పీడీ ద్వారా ఓ ప్రజాప్రతినిధి ద్వారా ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు తీసుకెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం.

నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలి

ఏఎస్ఓగా వచ్చేందుకు ప్రయత్నం చేస్తున్న ఇంగ్లిష్ టీచరు గతంలోనూ అదే సీటులో పని చేశారు. అప్పటి డీఈఓ అవసరాలను ఆసరా చేసుకుని డిప్యూటేషన్లు, టీచర్ల సర్దుబాటులో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు నేటికీ విద్యాశాఖ ఉద్యోగుల నుంచి వినిపిస్తూనే ఉన్నాయి. ఇలాంటి తరుణంలో ఏఎస్ఓ పోస్టును నోటిఫికేషన్ ద్వారానే భర్తీ చేయాలని గణితం, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు కోరుతున్నారు. స్వయంగా విద్యాశాఖ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులను డీఈఓ కార్యాలయ అధికారులు తుంగలో తొక్కుతున్నారంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. అస్మదీయుల కోసం ఒత్తిడి చేస్తున్న ప్రజాప్రతినిధుల తీరుపై మండిపడుతున్నారు. విద్యా వ్యవస్థ కుంటు పడేలా చేయొద్దని హితవు పలుకుతున్నారు.

ఫైలు పెట్టారట...



ఏఎస్ఓ పోస్టుకు ఇంగ్లిష్ టీచరును నియమించేలా ఫైలు పెట్టినట్లు తెలిసింది. అది నా వరకూ రాలేదు. నిబంధనల ప్రకారం గణితం, ఫిజికల్ సైన్స్ టీచర్లే అర్హులు. విషయాన్ని ఆర్జేడీ దృష్టికి తీసుకెళ్లి తుది నిర్ణయం తీసుకుంటాం.

– ఎం.ప్రసాద్‌బాబు, డీఈఓ

కారు ఢీ - ఇద్దరికి తీవ్ర గాయాలు

బొమ్మనహాళ్: కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు... బొమ్మనహాళ్‌లో బుధవారం జరిగిన ఊరి దేవర కార్యక్రమానికి ఇదే మండలంలోని ఉంతకల్లుకు చెందిన యువకులు యోగేంద్ర, చరణ్ హాజరయ్యారు. అనంతరం స్కూటీపై తిరుగు ప్రయాణమైన వారు ఉంతకల్లు క్రాస్ వద్ద మలుపు తిరిగి గ్రామం వైపుగా వెళుతుండగా కేజీబీవీ వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన కారు (ఏపీ40ఈజీ7607) ఢీకొంది. ఘటనలో యోగేంద్ర, చరణ్‌కు కాళ్లు విరిగాయి. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లుగా ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అంతేకాక ప్రమాదం జరిగిన వెంటనే కారుతో సహా ఉద్దేహాళ్ వైపు ఉడాయించాడన్నారు. క్షతగాత్రులను అంబులెన్సులో బళ్లారిలోని వైద్య కళాశాలకు తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కాగా, ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు లేదని ఎస్ఐ నబీరసూల్ పేర్కొన్నారు.

నకిలీ బంగారం విక్రేతల అరెస్ట్

- రూ.21 లక్షలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

సోమందేపల్లి: తక్కువ ధరకే మేలిమి బంగారాన్ని అందజేస్తామని నమ్మబలికి నకిలీ బంగారం అంటగట్టి డబ్బుతో ఉడాయించిన కేసులో పది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి పీఎస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. అన్నమయ్య జిల్లాకు చెందిన రాణా కృష్ణబాబు, కర్ణాటకకు చెందిన శాంతరాజు, నయాజ్ అహమ్మద్, ఈరన్న, బాబు, అర్జున్, ఆనంద్‌బాబు, బంగారి, ఈడిగ హరిప్రసాద్ ఓ ముఠాగా ఏర్పడి నకిలీ బంగారం దందా చేపట్టారు. ఈ క్రమంలోనే నకిలీ బంగారపు పూసల దండలు సేకరించుకుని, అందులో కొన్ని మేలిమి బంగారం పూసలను చేర్చారు. అనంతరం కొనుగోలుదారులు పరీక్షించుకునే సమయంలో మేలిమి బంగారం పూసలను మాత్రమే చూపించేవారు. ఇటీవల అనంతపురం జిల్లా విడపనకల్లుకు చెందిన ఈశ్వరన్న, చిత్తూరు జిల్లా కుప్పం నివాసి ముని వెంకటేష్‌కు ముఠా సభ్యులు ఫోన్ చేసి మాట్లాడారు. తమకు తవ్వకాల్లో మేలిమి బంగారం లభ్యమైందని, తక్కువ ధరకే వాటిని విక్రయిస్తామని నమ్మబలికారు. వారి మాయలో చిక్కుకున్న ఇద్దరినీ ఈ నెల 9న సోమందేపల్లి బ్రాహ్మణపల్లి వద్దకు రప్పించుకున్నారు. తొలుత ఈశ్వరన్న వద్ద రూ.8 లక్షలు తీసుకున్నారు. అనంతరం ముని వెంకటేష్ వద్ద రూ.13 లక్షలు తీసుకుని ఇద్దరికీ నకిలీ బంగారం పూసల దండలు చేతిలో పెట్టి గుట్టుచప్పుడు కాకుండా ఉడాయించారు. కాసేపటి తర్వాత వాటిని పరిశీలించుకున్న ఈశ్వరన్న, ముని వెంకటేష్... అవి నకిలీవని నిర్ధారించుకుని వెంటనే సీఐ రాఘవన్‌కు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన ఎస్ఐ రమేష్‌బాబు... బృందాలుగా విడిపోయి నిందితుల కోసం గాలింపు చేపట్టి బుధవారం పక్కా ఆధారాలతో మొత్తం పది మందినీ అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.21 లక్షలతో పాటు ఐదు సెల్‌ఫోన్లు, ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఇదే కేసులో మరికొందరు పరారీలో ఉన్నారని, త్వరలో వారిని కూడా అరెస్ట్ చేయబోతున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. తక్కువ మొత్తానికి బంగారం ఇస్తామని ఫోన్లు చేసి ఆశ చూపితే ఆకర్షణకు గురికావద్దని ప్రజలకు సూచించారు.

స్వాతంత్ర్య సమరయోధులను ఆదర్శంగా తీసుకోవాలి

గుంతకల్లు: స్వాతంత్ర సమరయోధులను ఆదర్శంగా తీసుకోవాలని డీఆర్ఎం సి.చంద్రశేఖర్ గుప్త పిలుపునిచ్చారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి, 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంతకల్లు డివిజన్ ఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో 42.2 కి.మీ వాక్‌థాన్ కం మల్కథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డీఆర్ఎంతోపాటు ఏడీఆర్ఎం సుధాకర్, ఆర్‌పీఎఫ్ డివిజన్ కమిషనర్ టి.మురళీకృష్ణ హాజరై, మాట్లాడారు. సమరయోధుల స్ఫూర్తితో చేపట్టిన ఈ కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన దాదాపు 72 మంది ఆర్‌పీఎఫ్‌లు పాల్గొంటున్నారన్నారు. విడపనకల్లు మండలం పెంచలపాడు మీదుగా కర్నూలు జిల్లా బంటన్‌హాల్ రైల్వేస్టేషన్ నుంచి చిప్పగిరిలో ప్రవేశించి అక్కడ నుంచి తిరిగి గుంతకల్లు రైల్వే జంక్షన్‌కు చేరుకుంటుందని తెలిపారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఆర్ఎం

జొన్న చిగురు తిని 40 గొర్రెల మృతి



పెద్దవడుగూరు: జొన్న చిగురు తిని ఏకంగా 40 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. పెద్దవడుగూరు మండలం కొండూరు గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు... మండలంలోని పి.వీరన్నపల్లి, కొండూరు గ్రామాలకు చెందిన రామకృష్ణ, సన్నప్ప, నాగభూషణ, గోపాల్.. గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నారు. వీరికి 200కు పైగా గొర్రెలు ఉన్నాయి. గ్రామ సమీపంలోనే పత్తి, కొర్రగడ్డి, వేరుశనగ, జొన్న, ఉలవలు తదితర పంటలు పూర్తయిన అనంతరం ఆయా పొలాల్లో గొర్రెలను మేపునకు విడిచేవారు. ఇందులో భాగంగానే కొండూరు గ్రామ సమీపంలో జొన్న పంట కోత పూర్తయిన రైతు దేవమోహన్‌రెడ్డి చేనులో బుధవారం సాయంత్రం గొర్రెలను వదిలారు. భూమిని కలియ దున్నినప్పటికీ అలాగే ఉండిపోయిన జొన్న కొయ్యలు చిగురు వేశాయి. విషయాన్ని గుర్తించని కాపరులు తమ గొర్రెలను చేనులో వదిలిన కాసేపటికే జొన్న చిగురు తిన్న 40 గొర్రెలు గిలగిల తన్నుకుంటూ మృతి చెందాయి. గమనించిన కాపరులు అప్రమత్తమయ్యేలోపు మరో 30 గొర్రెలు అపస్మారక స్థితికి చేరుకున్నాయి. ఘటనతో రూ.10 లక్షల మేర నష్టపోయినట్లు బాధిత కాపరులు వాపోయారు.

సోలార్ ప్లాంట్‌లో కేబుల్ అపహరణకు విఫలయత్నం

- ఇద్దరిని బంధించిన సెక్యూరిటీ సిబ్బంది

గుత్తి రూరల్: మండలంలోని ఎంగిలిబండ గ్రామ శివారులో ఉన్న సోలార్ ప్లాంట్‌లో కేబుల్ అపహరణకు దుండగులు విఫలయత్నం చేశారు. ప్లాంట్ యజమాని గోపాల్‌రెడ్డి తెలిపిన మేరకు.... మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్లాంట్‌లోకి చొరబడిన ఇద్దరు ఆగంతకులు... ప్యానెళ్లకు ఏర్పాటు చేసిన రూ.15లక్షలు విలువ చేసే కేబుల్ వైర్లను కట్ చేసి, ఎత్తుకెళుతుండగా సెక్యూరిటీ సిబ్బంది గమనించి కేకలు వేశారు. దీంతో కేబుల్‌ను పక్కన పడేసి దుండగులు పారిపోతుండగా వెంబడించి బంధించారు. అనంతరం సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని దుండగులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో గుత్తి మండలం జక్కలచెరువు గ్రామానికి చెందిన ఓ యువకుడితో పాటు కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రొళ్లపాడు తండాకు చెందిన మరో యువకుడు ఉన్నాడు. గతంలోనూ ఇదే సోలార్ ప్లాంట్‌లో రెండు సార్లు చోరీలు జరిగాయని సోలార్ ప్లాంట్ యజమాని తెలిపారు. 200 సోలార్ ప్యానెళ్లకు సంబంధించిన కేబుల్ కట్ చేయడంతో రూ.15లక్షల మేర నష్టం వాటిల్లిందని వాపోయారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రూడ్‌సెట్‌లో ఉచిత శిక్షణ

అనంతపురం: ఎస్కే యూనివర్సిటీ సమీపంలోని రూడ్‌సెట్ సంస్థలో ఈ నెల 25 నుంచి 30 రోజుల పాటు నిరుద్యోగ మహిళలకు కంప్యూటర్ ట్యాలీ కోర్సుపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు సంస్థ డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన గ్రామీణ మహిళలు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డుతో దరఖాస్తు చేసుకోవాలి. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తారు. పూర్తి వివరాలకు 94925 83484లో సంప్రదించవచ్చు.

పీఆర్సీని తక్షణమే ప్రకటించాలి : యూటీఎఫ్



కలెక్టరేట్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే ప్రకటించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్ వసంతలత ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ... 2023, జూలై 1 నుంచి అమలు కావాల్సిన 12వ పే రివిజన్ కమిషన్‌ను నేటికీ నియమించక పోవడం బాధాకరమన్నారు. 11వ పీఆర్సీకి సంబంధించిన బకాయిలు రూ. 7,384 కోట్లు, డీఏ బకాయిలు రూ. 9,650 కోట్లు, ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన సరెండర్ లీవ్ బకాయిలు రూ. 2,250 కోట్లు, సీపీఎస్ ఉద్యోగుల మ్యాచింగ్ గ్రాంట్ బకాయిలు రూ. 2,500 కోట్లు, ఏపీజీఎల్ఐ బకాయిలు రూ. 950 కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ప్రకారం 2004 ముందు నోటిఫికేషన్ ఇచ్చి 2004 తర్వాత నియామకం పొందిన 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు రమణయ్య, కార్యదర్శి సుబ్బరాయుడు, ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్, నాయకులు దేవేంద్రమ్మ, కోటేశ్వరప్ప, నాగేంద్ర, వేణుగోపాల్ రెడ్డి, మునలప్ప, ఆదిశేషయ్య పాల్గొన్నారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి వృషభాల బలప్రదర్శన



రాతిదూలం లాగుతున్న వృషభాలు

పామిడి: స్థానిక కొండూరు మార్గంలో వెలసిన అంకాలమ్మ, కుంటిమ్మ గ్రామదేవతల 17వ జాతర సందర్భంగా రెండు రోజులుగా సాగుతున్న రాష్ట్ర స్థాయి వృషభాల బల ప్రదర్శన హోరాహోరీగా సాగుతోంది. జాతర ముగింపు సందర్భంగా బుధవారం రాత్రి ఫ్లడ్ వెలుగుల్లో న్యూ కేటగిరి వృషభాల బలప్రదర్శన సాగింది. అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాలకు చెందిన 15 జతల వృషభాలను రైతులు తీసుకువచ్చారు. నంద్యాల జిల్లా పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన రైతు బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. 2వ స్థానంలో అదే జిల్లా ప్యాపిలి మండలం డి.రంగాపురం రైతు జూటూరు రామకృష్ణారెడ్డి వృషభాలు, 3 స్థానంలో అదే జిల్లా పెండ్లమర్రి మండలం బాలయ్యగారిపల్లి రైతు నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి వృషభాలు, 4వ స్థానంలో అనంతపురం జిల్లా అక్కంపల్లి రైతు కోనేపల్లి ఇంద్రారెడ్డి వృషభాలు, 5వ స్థానంలో వైఎస్సార్ జిల్లా చెన్నూరు మండలం బలిసింగాయపల్లి రైతు మేడా వంశీరెడ్డి వృషభాలు, 6వ స్థానంలో అదే జిల్లా ఖాదర్‌ఖాన్ కొట్టాల గ్రామ రైతు డి.భావనశ్రీ వృషభాలు నిలిచాయి. విజేత వృషభాల యజమానులను అభినందిస్తూ నిర్వాహకులు నగదు పురస్కారాలతో సత్కరించారు.

సోనా... మోసపోయినా!

- సోనా మసూరి పేరుతో రేషన్ బియ్యాన్ని అంటగట్టిన మోసగాళ్లు
- గంట వ్యవధిలోనే రూ.2.50 లక్షలతో ఉడాయించిన వైనం
- లబోదిబోమంటున్న కొనుగోలుదారులు

ఉరవకొండ: తక్కువ ధరకే నాణ్యమైన సోనా మసూరి బియ్యం అంటూ నమ్మబలికిన కొందరు మోసగాళ్లు విసిరిన వలలో పలువురు మహిళలు చిక్కుకున్నారు. మోసాన్ని గుర్తించే లోపు దాదాపు రూ.2.50 లక్షలను పోగు చేసుకుని ఆగంతకులు ఉడాయించారు. వివరాలు... బుధవారం ఉదయం ఉరవకొండలోని 5, 6 వార్డులతో పాటు మల్లేశ్వరస్వామి ఆలయం, రంగావీధిలో గుర్తు తెలియని వ్యక్తులు ఆటో నడుపుతూ తక్కువ ధరకే సోనా మసూరి బియ్యం అంటూ మహిళలను ఆకట్టుకున్నారు. మార్కెట్లో 50 కిలోల బస్తా రూ.4వేల వరకు ధర పలుకుతున్న సోనా మసూరి బియ్యాన్ని రూ.2,500కే ఇస్తామంటూ సాంపుల్ కింద కొంత తీసి చూపించారు. పరిశీలించి చూసిన పలువురు మహిళలు అవి సోనా మసూరి బియ్యమని నిర్ధారించుకుని ఒక్కొక్కరు రెండు, మూడు ప్యాకెట్లు చొప్పున కొనుగోలు చేశారు. మధ్యాహ్నం వంట చేసేందుకు బస్తాలను తెరిచి చూస్తే అందులో రేషన్ బియ్యం ఉండడం గమనించి అవాక్కయ్యారు. మొత్తం ఐదు వార్డుల్లో రూ.2.50 లక్షల మేర మహిళలకు కుచ్చుటోపీ వేసినట్లు బహిర్గతమైంది. జరిగిన మోసంపై కొందరు మహిళలు పరువు పోతుందని మౌనంగా ఉండగా, మరికొందరు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.



బస్తాలో ఉన్న రేషన్ బియ్యం

క్లుప్తంగా

రహదారి సూత్రాలు తప్పక పాటించాలి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీధర్

చెన్నేకొత్తపల్లి: వాహనదారులు రహదారి సూత్రాలను తప్పక పాటించాలని రామగిరి సీఐ శ్రీధర్ సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు రహదారి సూత్రాలపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనాలను నడిపే వారు తప్పక హెల్మెట్ ధరించడంతో పాటు వాహన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితిని మించి ప్రయాణికులను ఎక్కిస్తున్నారని ఈ పద్ధతిని మార్చుకోవాలన్నారు. ఎస్ఐ సత్యనారాయణతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన అసిస్టెంట్ కలెక్టర్



మేయర్ వసీంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో బుధవారం మేయర్ వసీంను అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మేయర్‌కు పుష్పగుచ్ఛం అందించారు. నెల రోజుల పాటు శిక్షణలో భాగంగా ఆమె నగరపాలక సంస్థలోని వివిధ అంశాలను తెలుసుకోనున్నారు.

చిన్నారులకు ఆధార్ నమోదు



అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆధార్ నమోదు చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆధార్ నమోదు చేస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవాణి, లావణ్య తెలియజేశారు. బుధవారం బి.యాలేరు అంగన్‌వాడీ కేంద్రంలో 32 మంది చిన్నారులకు ఆధార్ నమోదు చేసినట్లు వారు తెలిపారు. ఈ నెల 17 నుంచి చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఆధార్ నమోదు చేస్తున్నామన్నారు. ఆధార్ కార్డులు లేని చిన్నారులకు తల్లిదండ్రులు తమకు కేటాయించిన తేదీ వారీగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ నమోదు చేయించుకోవచ్చని సూచించారు.

నిత్యావసరాల అందజేత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: నగరంలో షిర్డీసాయి అన్నవితరణ ట్రస్టు ఆధ్వర్యంలో అజాద్ నగర్‌లోని ఆదరణ సేవా హోంకు రూ. 15 వేలు విలువజేసే నిత్యావసర సరుకులను బుధవారం వితరణగా అందించారు. హోంలో వృద్ధులు, నిరాశ్రయులైన మహిళలు, ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సేవలు అందిస్తుండడంతో నిత్యావసరాలు అందించినట్లు ట్రస్టు నిర్వాహకులు సుబ్రమణ్యం, సదాశివగుప్త, జగన్నాథ గుప్త తెలిపారు.

గుత్తికోట క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: గుత్తికోట పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గుత్తికోట క్యాలెండర్‌ను బుధవారం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షులు విజయభాస్కర్, డాక్టర్ హరిప్రసాద్, నటుడు మస్తాన్, రవి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోండి

ఆత్మకూరు: కంది పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని పంట సాగు చేసిన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ సుచరిత బుధవారం తెలియజేశారు. ప్రభుత్వం ఒక క్వింటా రూ.7,750 చొప్పున కొనుగోలు చేస్తోందన్నారు. పంట కొనుగోలు తర్వాత 15 రోజుల్లో రైతుల ఖాతాలకు నగదు జమవుతుందని తెలియజేశారు. ఇదిలా ఉండగా చాలా మంది రైతులు తాము పండించిన కంది పంటను రాయచూర్, బళ్లారి ప్రాంతాలకు అమ్మడానికి తీసుకెళ్తున్నారు.

గాడి తప్పిన పాలన!

- సీసీలుగా సచివాలయ ఉద్యోగులు
- కిందిస్థాయి సిబ్బందిపై పెత్తనం



అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో పాలన గాడితప్పింది. ఇక్కడ ఎవరి పనులు ఎవరు చేస్తున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. సచివాలయాల్లో పని చేసే ఉద్యోగులను తీసుకొచ్చి..నగరపాలక సంస్థ కమిషనర్ సీసీ, ఎంహెచ్ఓ అసిస్టెంట్లుగా వేయడం పెద్ద దుమారం రేపుతోంది. పలువురు సచివాలయ ఉద్యోగులు క్లాస్ 4 సిబ్బందిపై దుర్భాషలాడడం చర్చనీయాంశమైంది. ఇదే విషయమై మంగళవారం అసిస్టెంట్ కలెక్టర్ వినూత్నకు క్లాస్ 4 ఉద్యోగులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరుతో..

నగరపాలక సంస్థలో మొత్తం 74 సచివాలయాలున్నాయి. వాస్తవంగా ఈ సచివాలయాల్లో సిబ్బంది కొరత ఉంది. కానీ అందుబాటులో ఉన్న సిబ్బందిని సైతం వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరుతో క్యాంపు క్లర్క్‌లుగా కేటాయించడం విమర్శలకు దారితీస్తోంది. 31వ సచివాలయంలోని ఎడ్యుకేషన్ సెక్రటరీ శ్రీనివాస్, 72వ సచివాలయం వెల్ఫేర్ కార్యదర్శి కిశోర్, 22వ సచివాలయం ప్లానింగ్ కార్యదర్శి పాల్గుణను కమిషనర్ సీసీలుగా నియమించారు. అత్యంత కీలకమైన పోస్టుల నుంచి సిబ్బందిని తొలగించి వేరు సచివాలయాల్లో పని చేసే వారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఏమైనా సర్టిఫికెట్లు, పథకాలు అమలు, నిర్మాణాలపై ఆ సచివాలయాల పరిధిలో చర్యలు తీసుకునే వారే కరువయ్యారు. వాస్తవంగా నగరపాలక సంస్థలో రెగ్యులర్‌గా విధులు నిర్వర్తించే జూనియర్ అసిస్టెంట్లు అధికంగా ఉన్నారు. కానీ సచివాలయ ఉద్యోగులకు బాధ్యతలు ఇవ్వడం పెద్ద దుమారం రేపుతోంది. అదేవిధంగా ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి వద్ద పలువురు సచివాలయ ఉద్యోగులు అసిస్టెంట్లుగా పని చేస్తున్నారు. దీంతో ఆయా సచివాలయాల పరిధిలో పారిశుధ్య మెరుగుకు చర్యలు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి.

దుర్భాషలు

ఇటీవల నగరపాలక సంస్థలోని క్లాస్ 4 ఉద్యోగులను పలువురు సీసీలు దుర్భాషలాడారన్న ఆరోపణలున్నాయి. అనరాని మాటలు అనడంతో ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల క్లాస్ 4 ఉద్యోగులు కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

అన్ని ప్రాంతాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

- మేయర్ వసీం



వీధిలైట్లను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో అవసరం ఉన్న అన్ని ప్రాంతాల్లో వీధి లైట్లను ఏర్పాటు చేయాలని మేయర్ వసీం ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మేయర్ వసీం ప్రత్యేక చొరవతో నగరపాలక సంస్థకు రూ.40 లక్షలతో 682 వీధి లైట్లు, రూ.10 లక్షలతో 47 పుష్‌కాట్స్‌ను అధికారులు కొనుగోలు చేశారు. బుధవారం నగరపాలక సంస్థలో ఉన్న నూతన లైట్లు, పుష్‌కాట్స్‌ను డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ మల్లికార్జున రెడ్డితో కలసి మేయర్ పరిశీలించారు. వీధిలైట్లు నాణ్యత తదితర వాటిపై మేయర్ ఇంజినీరింగ్ అధికారులను ఆరా తీశారు. వీధి లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

చెత్త సేకరణ పక్కాగా చేపట్టాలి: నగరంలో చెత్త సేకరణ వేగవంతం చే సేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ని మేయర్ ఆదేశించారు. అవసరం ఉన్న ప్రాంతంలో పుష్‌కాట్స్‌లను ఏర్పాటు చేసి సకాలంలో చెత్త సేకరించాలన్నారు. ఎంహెచ్ఓ, సచివాలయ పారిశుద్ధ్య కార్యదర్శులను అప్రమత్తం చేయాలన్నారు. నగర ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయొద్దని సూచించారు. ఈఈ షాకీర్, డీఈ దాక్షాయణి, ఏఈ సాయినాథ్ బాబు, కార్పొరేటర్లు బాలాంజనేయులు, శేఖర్ బాబు, అబూసలేహ, సైఫుల్లాబేగ్, వైఎస్సార్ సీపీ నాయకులు దాదూ, రవీంద్రరెడ్డి, రవి, కాకర్ల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బాగా చదువుకుని ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు, ఏజీ ప్రమీలమ్మ

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ ప్రసాద్‌బాబు సూచించారు. బుధవారం స్థానిక రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు ఎస్టీయూ స్టడీ మెటీరియల్‌ను దాత ఏజీ ప్రమీలమ్మ సహకారంతో ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో తయారు చేసిన ఎస్టీయూ స్టడీ మెటీరియల్‌ను ఉపయోగించుకుని మంచి మార్కులు సాధించాలని సూచించారు. దాత ఏజీ ప్రమీలమ్మ మాట్లాడుతూ నగరపాలక ఉన్నత పాఠశాలల్లో 500 మంది విద్యార్థులకు ఈ మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేశామన్నారు. చదువుతో ప్రపంచంలో దేనినైనా సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వై.రేణుక, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి .రామాంజనేయులు, రాష్ట్ర మున్సిపల్ కమిటీ కన్వీనర్ ఫణిభూషణ్, ఉపాధ్యాయులు హెచ్. రామాంజులు, శ్రీదేవి, విజయభాస్కర్ రెడ్డి, ఆదినారాయణ, గాంగే నాయక్, శైలేంద్ర సాగర్, రవీంద్ర, మంజుల, కరుణ, దేవకుమారి, ఉమా, కమలమ్మ, నాగలక్ష్మి, సంపత్ కుమార్ రెడ్డి, విరుపాక్షిగౌడ్, యుగంధర్, రమేష్ పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం లాభదాయకం



వడ్డుపల్లిలో రైతులకు సూచనలిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

ఆత్మకూరు: సేంద్రియ వ్యవసాయం లాభదాయకంగా ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ) ఉమామహేశ్వరమ్మ తెలియజేశారు. బుధవారం వడ్డుపల్లి గ్రామ సమీపాన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ సేంద్రియ పద్ధతుల ద్వారా పంటలు సాగు చేయడంతో కుటుంబ అవసరాలు తీరడంతోపాటు రైతు ఆర్థికంగా లాభపడవచ్చన్నారు. రబీ పంటలకు సంబంధించి ఈ క్రాప్ నమోదు జరుగుతోందని, పంటలకు యూనిక్ ఐడింటిఫికేషన్ నంబర్స్ రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. పీఎం-కిసాన్ లబ్ధిదారులందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వ్యవసాయానికి సంబంధించి ఏ సమస్య వచ్చినా రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత, వడ్డుపల్లి సర్పంచ్ లక్ష్మినారాయణరెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక రంగంలో అనేక మార్పులు



ట్రైనింగ్ ఆఫీసర్ రంగబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

అనంతపురం ఎడ్యుకేషన్: సాంకేతిక రంగంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయని అందుకనుగుణంగా విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని ఐటీఐ ట్రైనింగ్ ఆఫీసర్ బి.రంగబాబు సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐలో 'స్కిల్ అవర్' కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బి.రంగబాబు మాట్లాడుతూ సాంకేతిక రంగంలో మారుతున్న మార్పులకు అనుగుణంగా మెలకువలు నేర్చుకుంటే ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. ఐటీఐ పూర్తికాగానే మూడు అవకాశాలు అందుబాటులో ఉంటాయన్నారు. అప్రెంటిషిప్, ఇంటర్న్‌షిప్, నేరుగా ఉద్యోగాల్లో చేరే అవకాశాలు ఉంటాయన్నారు. రైల్వే, నావల్, ఎయిర్‌లైన్స్, ఇస్రో తదితర కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోనూ ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రిన్సిపాల్ రామమూర్తి మాట్లాడుతూ హైదరాబాద్, పెనుకొండ, హిందూపురం, దొడ్డబల్లాపూర్, బెంగళూరు నగరాల్లోని ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఉద్యోగ అవకాశాలు విస్తారంగా ఉంటాయన్నారు.

ఎండోమెంటు ఏసీని సస్పెండ్ చేయండి



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న అర్చకులు

అనంతపురం కల్చరల్: అర్చకుల అభ్యున్నతిని పట్టించుకోకుండా ఫైల్స్‌ను పెండింగ్‌లో పెడుతున్న దేవదాయ శాఖ(ఎండోమెంటు) ఏసీ ఆదిశేషనాయుడును వెంటనే సస్పెండ్ చేయాలని జిల్లా అర్చక సమాఖ్య నాయకులు డిమాండు చేశారు. జిల్లా ఎండోమెంటు అసిస్టెంట్ కమిషనర్ వైఖరిని నిరసిస్తూ మంగళవారం జిల్లా అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో ఎండోమెంటు కార్యాలయం నుంచి నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మను కలిసి వినతిపత్రమందించారు. ఈ సందర్భంగా జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు మాట్లాడుతూ డెత్ గ్రాట్యుటీ మంజూరులో దేవదాయ కార్యాలయం నుంచి ఫైల్స్ కదలడం లేదన్నారు. అర్చకుడు మృతి చెందితే దూపదీప నైవేద్యం పథకం ఎందుకు వర్తింపజేయరని ప్రశ్నించారు. అర్చకుల సమస్యలు వినే ఓపిక ఎండోమెంటు అధికారులకు లేకపోవడం ఆవేదన కల్గిస్తోందన్నారు. ఆలయ ఈఓలకు సమస్యలు చెప్పుకుంటే సహాయ కమిషనర్ ఆఫీసుకు పంపించామంటారని, అక్కడి వెళితే ఈఓలు చూసుకుంటారని సమాధానమొస్తోందని విచారం వ్యక్తం చేశారు. అధికారుల అలసత్వం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అర్చకులకు రైతు భరోసా, విత్తన సబ్సిడీ పథకాలను వర్తింపజేయడంలో విఫలమవుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాఖ్య కార్యదర్శి శ్రీనివాసులు, హనుమంతరాయుడు, చంద్రమౌళి, రామచంద్ర తదితరులు హాజరయ్యారు.

సుస్థిర సాగు పద్ధతులు లాభదాయకం



మాట్లాడుతున్న ఉద్యానశాఖ డీడీ నరసింహారావు

అనంతపురం అగ్రికల్చర్: శాస్త్రీయ పద్ధతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని సుస్థిర సాగు పద్ధతులు పాటిస్తే రైతులకు లాభసాటిగా ఉంటుందని ఉద్యానశాఖ డీడీ బీఎంవీ నరసింహారావు తెలిపారు. బుధవారం స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణ కేంద్రంలో ఉద్యానశాఖ, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సౌత్ రీజియన్) సంయుక్త ఆధ్వర్యంలో రైతులు, ఉద్యానశాఖ అధికారులు, ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీడీహెచ్‌తో పాటు ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి, అసోసియేషన్ ప్రతినిధి వైవీఎస్ మూర్తి, హెచ్ఓ రత్నకుమార్ సుస్థిర సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. పంటల సాగులో పాటించాల్సిన మేలైన యాజమాన్యానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించుకోవాలని సూచించారు. దుక్కిస్థాయి నుంచి చీడపీడలు, కలుపు, నీటి యాజమాన్యం, మార్కెటింగ్ వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ప్రధానంగా పోషక యాజమాన్యంపై పరిజ్ఞానం పెంచుకోవాలని తెలిపారు. రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్ చీఫ్ మేనేజర్ ఎస్.రాజశేఖర్, సీఐఎల్ కంపెనీ ప్రతినిధి గోవిందరాజులు, ఇఫ్కో మణికళ్యాణ్, స్పిక్ కంపెనీ ప్రతినిధి భాస్కర్, కోరమాండల్, స్పిక్, ఇఫ్కో, ఇండియన్‌పొటాష్, టిమాక్ అగ్రో కెమికల్స్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈసందర్భంగా స్టాల్స్ ఏర్పాటు చేశారు.

శభాష్ ధీరజ్!

- కళ్లకు గంతలతో రంగులు, అక్షరాలు చెప్పేస్తున్న విద్యార్థి



కళ్లకు గంతలు కట్టుకుని క్యూబిక్ ఫజిల్ చేస్తున్న విద్యార్థి గాండ్ల ధీరజ్

అనంతపురం ఎడ్యుకేషన్: కళ్లకు గంతలు కట్టుకుని బాల్స్ చేతికి ఇస్తే చేతి స్పర్శ, వాసన, శబ్దం ద్వారా వాటి రంగు ఇట్టే చెప్పేస్తున్నాడు విద్యార్థి గాండ్ల ధీరజ్. అనంతపురం రూరల్ కక్కలపల్లికి చెందిన గాండ్ల ఆదినారాయణ కుమారుడు గాండ్ల ధీరజ్ మరూరు సమీపంలోని మాంటిస్సోరి ఎలైట్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. 'బ్రెటైర్ మైండ్స్' కార్యక్రమంలో భాగంగా నగరంలోని రామచంద్రమిషన్‌లో శిక్షణ పొందాడు. బ్రెయిన్‌లో ఉన్న నాడిని యాక్టివేట్ చేసి తాకడం, వాసన, శబ్దం ద్వారా రంగులు, అక్షరాలు, గుర్తిస్తారు. ఉదాహరణకు పది రకాల బాల్స్ ఒక్కొక్కటీ చేతికిస్తే..తీక్షణంగా పరిశీలించి తాకి లేదా వాసన చూసి ఇంకా స్పష్టత రాకపోతే బాల్‌ను రెండు వేళ్లతో శబ్దం చేసి రంగును చెప్పేస్తాడు. పేపర్‌లో ఏదైనా పదం రాసిచ్చినా పైన పేర్కొన్న మూడు పద్ధతుల్లో పరిశీలించి ఇట్టే చెప్పేస్తాడు. క్యూబిక్ ఫజిల్ ఆరు రంగులూ (నాలుగు వైపులా) నిముషంలోపు సెట్ చేసి అబ్బురపరుస్తున్నాడు. సూది, దారం వేర్వేరుగా ఇచ్చినా సూదిలో దారం ఎక్కిస్తాడు. ఇవన్నీ కూడా కళ్లకు గంతలు కట్టుకుని చేసి అబ్బురపరుస్తున్నాడు. బ్రెటైర్ మైండ్స్ అనేది హార్ట్‌ఫుల్‌నెల్ లెర్నింగ్ నుంచి ప్రారంభమైన ప్రత్యేక కార్యక్రమం అని రామచంద్ర మిషన్ నిర్వాహకులు చెబుతున్నారు. ఇది పిల్లల్లో ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, సృజనాత్మకతను మెరుగుపరుస్తుందని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనంతపురం అర్బన్ నియోజకవర్గ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకాలు జరిగాయి. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. యువజన విభాగం అధ్యక్షుడిగా టీఆర్ శ్రీనివాస గురుదత్తా, మహిళా విభాగం సాకే చంద్రకళ, రైతు విభాగం ఎం.నాగేశ్వరరెడ్డి, బీసీ సెల్ బోయ లక్ష్మన్న, ఎస్సీ సెల్ పసులూరి ఓబులేసు, ఎస్టీ సెల్ గుజ్జల శివయ్య, క్రిస్టియన్ మైనార్టీ విభాగం టి.విజయ్‌సతీష్‌కుమార్, ముస్లిం మైనార్టీ విభాగం షేక్ మన్సూర్‌బాషా, విద్యార్థి విభాగం జి.కైలాష్, పంచాయతీరాజ్ విభాగం మీరుగ విజయ్‌కుమార్, మునిసిపల్ విభాగం ముద్దాంగల దేవి, ఆర్టీఐ విభాగం జూటూరు సుధాకర్‌రెడ్డి నియమితులయ్యారు. వలంటీర్స్ విభాగం అధ్యక్షుడిగా కోన రాజారెడ్డి, గ్రీవెన్స్ సెల్ విభాగం ఎం.పురుషోత్తం, వాణిజ్య విభాగం ఎస్‌జె మంజునాథ్, చేనేత విభాగం దేవాంగం రామయ్య, వైఎస్సార్‌టీయూసీ విభాగం షేక్ ఖాజా, అంగన్‌వాడీ విభాగం బి.లావణ్య, లీగల్‌సెల్ విభాగం ఎస్.వెంకటరాముడు, కల్చరల్ విభాగం కసిరెడ్డి కేశవరెడ్డి, సోషల్ మీడియా విభాగం వై.శ్రావణ్‌కుమార్‌రెడ్డి, ఐటీ విభాగం ఎం.పవన్‌కుమార్, దివ్యాంగుల విభాగం ఎస్‌కే కాలేష్, డాక్టర్స్ విభాగం గొస్‌పీరా తాటిచెర్ల, పబ్లిసిటీ విభాగం బంగి సుదర్శన్, బూత్ కమిటీల విభాగం భోగతి రవీంద్రరెడ్డి, ఇంటెలిజెన్స్ ఫోరం అధ్యక్షుడిగా సి.జయప్రకాష్‌రెడ్డిని నియమించారు.

విద్యార్థి అదృశ్యం.. వెంటనే ఆచూకీ లభ్యం



అదృశ్యమైన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

గార్లదిన్నె: మండల కేంద్రం గార్లదిన్నెకు చెందిన ఓ విద్యార్థి అదృశ్యమై వెంటనే ఆచూకీ లభించింది. పోలీసుల తెలిపిన వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన వెంకటరెడ్డి, కవిత కుమారుడు లోకేష్‌రెడ్డి ఓ ప్రైవేట్ పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నాడు. రోజూలాగే మధ్యాహ్నం భోజనానికి ఇంటిక వచ్చిన విద్యార్థి అన్నం తిన్న తరువాత చెయ్యి శుభ్రం చేసుకునేందుకు బయటకు వచ్చాడు. ఎంతసేపటికి బాలుడు ఇంట్లోకి రాకపోవడంతో అనుమానంతో కవిత ఇంటి పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్లు వెతికినా కుమారుడు ఆచూకీ లభ్యం కాలేదు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు పరిసర ప్రాంతాలు పరిశీలిస్తుండగా బాలుడు బాత్‌రూంలోనే ఉన్నట్లు గుర్తించి, తల్లిదండ్రులకు అప్పగించారు.

స్పర్శలేని మచ్చలు ఉంటే డాక్టర్‌ను సంప్రదించండి



చెన్నేకొత్తపల్లిలో వ్యక్తిని పరీక్షిస్తున్న డాక్టర్ రవినాయక్

చెన్నేకొత్తపల్లి: శరీరంపై స్పర్శలేని మచ్చలు ఉన్నట్లయితే వైద్యుడితో పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ ప్రజలకు సూచించారు. మండల కేంద్రంలో జరుగుతున్న కుష్ఠు సర్వే కార్యక్రమాన్ని బుధవారం డాక్టర్ తనిఖీ చేశారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం డాక్టర్ కొందరిని స్వయంగా పరీక్షించారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



ఇమ్యునైజేషన్‌ను పరిశీలిస్తున్న డీఐఓ యుగంధర్

రాప్తాడు: వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని వైద్య, ఆరోగ్య సిబ్బందిని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి(డీఐఓ) యుగంధర్ హెచ్చరించారు. ఆయన బుధవారం హంపాపురం సచివాలయంలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా ఇమ్యూనైజేషన్ రికార్డులు పరిశీలించారు. అనంతరం రాప్తాడులో పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు, ఆస్పత్రి లోపల, బయట పరిశుభ్రతను, మందుల గదిని పరిశీలించారు. పీహెచ్‌సీలో అందిస్తున్న వైద్య సేవలపై రోగులతో ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ మహిళలు గర్భం దాల్చిన రోజు నుంచి ప్రసవం, బాలింత, శిశు సంరక్షణకు సంబంధించి ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు తప్పనిసరిగా చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులకు ఆరోగ్య సూత్రాలు, పోషకారంపై అవగాహన కల్పించి, జిల్లాలో మాతా శిశు మరణాలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. పోషకాహార లోపం కారణంగా రక్తహీనత సంభవిస్తుందన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు సద్వినియోగం చేసుకునేలా అగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. సోమవారం మినహా రోజూ మెడికల్ ఆఫీసర్స్ క్యాంపులకు వెళ్లాలని స్పష్టం చేశారు. వైద్యాధికారులు శ్రావణి, శివకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దామోదరరెడ్డికి గిడుగు జాతీయ పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న దామోదర్ రెడ్డి

అనంతపురం: నగరంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాల, ప్రిన్సిపాల్ డాక్టర్ పామిరెడ్డి దామోదరరెడ్డికి గిడుగు జాతీయ పురస్కారాన్ని అందజేశారు. హైదరాబాద్‌లోని గిడుగు రామ్మూర్తి ఫౌండేషన్ , శంకరం వేదిక ఆధ్వర్యంలో బుధవారం ఈ పురస్కారాన్ని అందుకున్నారు. సాహిత్య పరిశోధన విభాగంలో ఆయన రచించిన రామాయణం- చారిత్రక దృక్కోణం అనే పరిశోధన కావ్యానికి ఈ పురస్కారం దక్కింది. అంతే కాకుండా ప్రాచీనాంధ్ర కావ్యాలు- రాజనీతి, సిరియాళ కథలు- తులనాత్మక విశ్లేషణ, కళ్యాణదుర్గం జానపద సమీక్ష, రాయలసీమ జానపద గేయ సౌందర్యం, రేనాటి సింహం (చారిత్రక నవల)కు ప్రముఖ సాహితీవేత్తల ప్రశంసలు లభించాయి. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్, నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షుడు, కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ, ఆలిండియా బార్ కౌన్సిల్ మెంబర్ ఆలూరి రామిరెడ్డి తదితరులు దామోదర రెడ్డిని అభినందించారు.